## క్లుప్తంగా

### సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

ఇబ్రహీంపట్నం: రైతులకు రుణమాఫీ చేయడంపై మండలంలోని వేములకుర్తి, వర్షకొండ గ్రామాల్లో రైతుల రుణమాఫీ చేయడంతో సీఎం కేసీఆర్ చిత్రపటానికి రైతులు, నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో యామాపూర్ సింగిల్ విండో చైర్మన్ అంకతి రాజన్న, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పానకంటి వెంకట్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాజన్న, రైతుబంధు సమన్వయ సమితి గ్రామ కన్వీనర్ శివరాజం, నాయకులు పాల్గొన్నారు.

### కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి


సమ్మెకు మద్దతు తెలుపుతున్న నాయకులు

బుగ్గారం: తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న పంచాయతీ సిబ్బంది డిమాండ్లను నెరవేర్చాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమ్మెకు శనివారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. కనీస వేతన చట్టం ప్రకారం వారికి జీతాలు చెల్లించడమే కాకుండా ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్ మహారాజ్, తిరుపతి మహారాజ్, పూర్ణచందర్ మహారాజ్, జశ్వంత్ మహారాజ్, అష్రఫ్ పాల్గొన్నారు.

### అన్ని రంగాల్లో మెట్‌పల్లి డివిజన్ ముందంజ


ఆర్డీవోను సత్కరిస్తున్న టీఎన్జీవో నాయకులు

జగిత్యాల: మెట్‌పల్లి డివిజన్ అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేందుకు కృషి చేయాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోగ శశిధర్, నాగేందర్ అన్నారు. ఇటీవల బదిలీపై వచ్చిన మెట్‌పల్లి ఆర్డీవో మధును కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులందరి సహకారంతో డివిజన్‌ను ముందంజలో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ట్రెస్మా జిల్లా అధ్యక్షుడు వకీల్, అమరేందర్ రెడ్డి, రాజేందర్, మాదం రవి, శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

పెగడపల్లి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్నట్లు తహసీల్దార్ ఎంఏ ఫారుక్ అన్నారు. పెగడపల్లితో పాటు మండలంలోని నామాపూర్, మ్యాకవెంకయ్యపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన సందర్శించి వసతులపై ఆరా తీశారు. ఆయన వెంట సర్పంచులు శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి, లక్ష్మి, ఆర్డైలు శ్రీనివాస్, అనిల్, ఉప సర్పంచ్ సంతోష్, ఉన్నారు.

### అంబేడ్కర్‌కు క్షీరాభిషేకం

సారంగాపూర్: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించడంపై మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. స్వీట్లను పంపిణీ చేశారు. దేశంలో, రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీర్‌పూర్ వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, నాయకులు రాంచంద్రారెడ్డి, ఇబ్రహీం పాల్గొన్నారు.

**దరఖాస్తుల ఆహ్వానం**

జగిత్యాల: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒకేషనల్ ఫిషరిష్ అతిథి అధ్యాపకుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా శనివారం తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈనెల 8లోపు సంబంధిత సర్టిఫికెట్లు జతచేసి కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి ఆఫీసులో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

సండే స్పెషల్

# సుస్వరం.. యువ గళం

కోరుట్లటౌన్: పట్టణానికి చెందిన నేరెళ్ల శ్రీవర్ధన్ వర్ధమాన గాయకుడిగా రాణిస్తున్నాడు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లుగా శ్రీవర్ధన్ చిన్నప్పటి నుంచే పాటలు పాడుతూ చిన్నప్పుడే వివిధ సభల్లో పాటలు పాడి ప్రశంసలు, బహుమతులు పొందాడు. సంగీతంపై ఇష్టంతో పాడుతా తీయగా మొదటి విజేత నేమాని పార్థసారథి వద్ద 4 ఏళ్లు సంగీతం నేర్చుకున్నారు. వివిధ పత్రికల్లో సబ్ ఎడిటర్ పని చేశారు. కొద్దిరోజులు కంటెంట్ రైటర్‌గా పని చేశారు. కరోనా తరువాత హైదరాబాద్ నుంచి కోరుట్లకు వచ్చి, 2020లో పెళ్లి చేసుకున్నాడు. కోరుట్ల సమీపంలోని కథలాపూర్ మండలం దూలూరు రామాలయంలో పూజారిగా వృత్తి చేపట్టాడు.



- సంగీతంలో రాణిస్తున్న శ్రీవర్ధన్
- చిన్నప్పుడే సభావేదికలపై గానం
- 10 ఏళ్లలో అనేక బహుమతులు
- జూనియర్ బాలసుబ్రహ్మణ్యంగా ప్రశంసలు
- అధికారులతో సన్మానాలు





**గాయకుడిగా గుర్తింపు**

శ్రీవర్ధన్ చిన్నప్పటి నుంచే పాటలు పాడుతూ అందరి ఆశీర్వాదాలు పొందాడు. ప్రాథమిక విద్య చదువుతున్నప్పుడు పాఠశాలలో జరిగే సభల్లో పాటల పోటీల్లో ప్రథమ బహుమతులు పొందాడు. ప్రముఖ కవులు, అధికారులు ఆయన పాటలకు మంత్ర ముగ్ధులై ప్రశంసలు, బహుమతులు, సన్మానాలు చేశారు. సినీ రచయిత డాక్టర్ సి.నారాయణరెడ్డి, అవధాని డాక్టర్ అందె వెంకట్రాజం, అప్పటి ఎమ్మెల్యే జువ్వాడి రత్నాకర్‌రావు, కలెక్టర్ బీ ఆర్ మీనా చేతుల మీదుగా సన్మానం అందుకున్నాడు. మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాటల పోటీలో శ్రీవర్ధన్ పాట మెచ్చుకుని, అప్పటి మున్సిపల్ చైర్ పర్సన్ అంబల్ల మాధవి జూనియర్ బాలసుబ్రహ్మణ్యం బిరుదు ప్రదానం చేశారు.

**ఉన్నత విద్య.. ఉద్యోగ అవకాశాలు**

కోరుట్ల పట్టణంలో ఇంటర్ విద్య పూర్తి చేసిన నేరెళ్ల శ్రీవర్ధన్ ఉన్నత విద్య కోసం హైదరాబాద్ వెళ్లాడు. బీ.టెక్ విద్య చదువుతున్న క్రమంలో ఓ పత్రిక ఛానల్‌లో సబ్ ఎడిటర్‌గా ఉద్యోగ అవకాశం వచ్చింది. 5 ఏళ్లు విధులు నిర్వహించాడు. అనంతరం 2 ఏళ్లు మరొక పత్రిక ఛానల్‌లో సీనియర్ సబ్ ఎడిటర్‌గా పని చేశాడు. ఒక వైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు సంగీత సాధన మాత్రం వదల్లేదు. సంగీతంపై ఇష్టంతో పాడుతా తీయగా మొదటి విజేత నేమాని పార్థసారథి వద్ద 4 ఏళ్లు సంగీతం నేర్చుకున్నారు. సంగీత విభావరీలకు హాజరై, గాయకుడిగా శ్రీవర్ధన్ మెప్పు పొందాడు. ఈ క్రమంలో 25 పాటలు కంపోజ్ చేశాడు. 50 ప్రైవేట్ ఆల్బమ్స్, షార్ట్‌ఫిల్మ్స్‌లో శ్రీవర్ధన్‌కు గాయకుడిగా మంచి పేరు ప్రఖ్యాతులు పొందాడు.

**సంగీత దర్శకుడిగా ఎదగడమే లక్ష్యం**

సినీ సంగీత దర్శకుడిగా ఎదగడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాను. మ్యూజిక్‌పై ఆసక్తి ఉన్న వారు సంప్రదిస్తే, సంగీతం నేర్పుతాను

– నేరెళ్ల శ్రీవర్ధన్, వర్ధమాన గాయకుడు, పూజారి,

**ప్రత్యేక అవార్డులు**



1997–సినీగేయ రచయిత సి.నారాయణరెడ్డి అభినందన పూర్వక సన్మానం
1998– కలెక్టర్ బీ.ఆర్. మీనా జిల్లా స్థాయి పురస్కారం
1999– నాగార్జున కల్చరల్ అకాడమీ రాష్ట్ర స్థాయి ఉత్తమ గాయక పురస్కారం
2020–సేవ్ ఎ లైఫ్ ఫౌండేషన్ హైదరాబాద్ 'బెస్ట్ ఎమర్జింగ్ మ్యూజిక్ డైరెక్టర్' అవార్డు
2021– అరుణ ఆర్ట్స్ హైదరాబాద్ 'బెస్ట్ సింగర్' అవార్డు
2022–సినీ నిర్మాత దిల్‌రాజు నిర్మించిన ఇందూరు తిరుమల క్షేత్రం ఆస్థాన గాయకుడిగా నియామకం

### బీసీలకు ఎక్కువ టికెట్లు ఇచ్చే పార్టీలకే మద్దతు


మాట్లాడుతున్న అధ్యక్షుడు రమేశ్‌గౌడ్

కథలాపూర్: వచ్చే ఎన్నికల్లో బీసీలకు అధిక ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చిన రాజకీయ పార్టీలకే బీసీల మద్దతు ఉంటుందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ అన్నారు. మండలంలోని ఇప్పపెల్లిలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సభ్యులతో సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వచ్చే నెలలో జగిత్యాలలో బీసీలతో భారీ సభ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. బీసీల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, బీసీలకు సంక్షేమ పథకాలు అందించడంలో విఫలమైందని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో బీసీలు సత్తా చాటే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. సమావేశంలో సంఘం నాయకులు రవి, అంజనేయులు, శంకర్, రాజన్న పాల్గొన్నారు.

### భగీరథ పనులు పరిశీలన


పనులు పరిశీలిస్తున్న అధికారులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో మిషన్ భగీరథ పథకంలో చేపట్టిన పనులను క్వాలిటీ కంట్రోల్ డీఈ రామచంద్రం శనివారం పరిశీలించారు. ఆయా వాడల్లో వేసిన పైపులు, ఇంటింటికి నల్లా కనెక్షన్లు బిగించిన వాటిని పరిశీలించారు. పైపుల లీకేజీలు, నీటిని ఏ మేరకు వినియోగిస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏఈ చంద్రశేఖర్, సాంబయ్య, వెంకటేశం, కాంట్రాక్టర్ నర్సింగరావు, విక్రమ్ ఉన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్


మోతెలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: గ్రామాలు, పట్టణాల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి అన్నారు. జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోతెలో శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం ప్రజల్లో భద్రత భావం పెంచడం పోలీసు శాఖ లక్ష్యమన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వచ్చినా, నేరస్తులు కన్పించినా వారికి షెల్టర్ ఇవ్వొద్దన్నారు. నేర రహిత గ్రామాలుగా చేయడమే పోలీసు శాఖ లక్ష్యమన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో ఎలాంటి పత్రాలు లేని 22 వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో సీఐ ఆరిఫ్ అలీఖాన్, ఎస్సైలు సదాకర్, రహీం, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## 'హామీలు నెరవేర్చని ప్రభుత్వం గద్దె దిగాలి'


నిరసన తెలుపుతున్న బీజేవైఎం నాయకులు

జగిత్యాలటౌన్: రాష్ట్ర ప్రజలు, నిరుద్యోగ యువతకిచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిన కేసీఆర్ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రెంటం జగదీశ్ డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతిపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం ఐడీవోసీ ఎదుట నిరసన తెలిపిన నాయకులు నిరుద్యోగ సమస్య, నిరుద్యోగ భృతిపై అదనపు కలెక్టరుకు మెమోరాండం అందజేశారు. అనంతరం జగదీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు భర్తీ చేసే వరకు నిరుద్యోగ భృతి ఇస్తామని యువతను మభ్యపెట్టి 2018లో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి మంచె రాజేశ్, జిల్లా కోశాధికారి గుర్రం రంజిత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కురుమ రమేశ్, అరుణ్ యాదవ్, కొండ్ర రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## అరెస్టులపై ఏఎన్ఎంల ఆందోళన


ఆందోళన చేస్తున్న రెండో ఏఎన్ఎంలు

జగిత్యాలటౌన్: అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన రెండో ఏఎన్ఎంలను ముందస్తు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శనివారం జగిత్యాల కలెక్టరేట్ ఎదుట ఏఎన్ఎంలు ఆందోళన చేపట్టారు. షరతులు లేకుండా తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరుతూ శుక్రవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వగా భగ్నం చేసేందుకు పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు గాండ్ల మధురిమ మాట్లాడుతూ హౌజ్ అరెస్టులతో తమ హక్కులను హరించవద్దని కోరారు. కార్యక్రమంలో మమత, గూడూరి జయప్రద, శైలజ, జ్యోతి, జయసుధ, పద్మ, నీరజ పాల్గొన్నారు.

## 'పింఛన్ కోసం వెళ్తే చనిపోయాడంటున్నారు'


దివ్యాంగుడు సబ్బని చిన్ననర్సయ్య

మల్లాపూర్: పింఛన్ కోసం వెళ్తే వెబ్‌సైట్‌లో చనిపోయినట్లు చూపిస్తోందని.. నాలుగేళ్లుగా పింఛన్ కోసం ఎదురుచూస్తున్నానని మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన దివ్యాంగుడు సబ్బని చిన్ననర్సయ్య ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. బాధితుడికథనం ప్రకారం ముత్యంపేటకు చెందిన సబ్బని చిన్ననర్సయ్య 5 ఏళ్ల క్రితం పక్షవాతానికి గురికాగ, పాక్షికంగా కాళ్లు చేతులు పనిచేయకపోవడంతో ఇంటికే పరిమితమయ్యాడు. దీంతో ఆసరా పింఛన్ కోసం సదరన్ సర్టిఫికెట్‌ను పొందాడు. ఆ పత్రాలతో మీ సేవ కి వెళ్లి దివ్యాంగ పింఛన్‌కు దరఖాస్తు చేసుకుంటే ఆ వెబ్‌సైట్‌లో తాను చనిపోయినట్లు చూపిస్తోందని సదరు మీ సేవ నిర్వాహకుడు తెలపడంతో నిర్ఘాంతపోయాడు. అప్పటి నుంచి నాలుగేళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. పింఛన్ మంజూరు కావడం లేదని వాపోయాడు. ఇప్పటికైనా వెబ్‌సైట్‌లో సవరణ చేసి ఆసరా పింఛన్ మంజూరు చేయాలని కోరుతున్నాడు. దీనిపై ఎంపీడీవో జగదీష్‌ను వివరణ అడుగగా సబ్బని చిన్ననర్సయ్య పెన్షన్ వెబ్‌సైట్‌లో చనిపోయినట్లు చూపిస్తున్న విషయం తమ దృష్టికి రాలేదని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పింఛన్ మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు.

### మంత్రి ఎర్రబెల్లిని కలిసిన పీఏసీఎస్ చైర్మన్

కొండగట్టు: కొడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ మేనేని రాజనర్సింగరావు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును శనివారం హైదరాబాద్ అసెంబ్లీ ప్రాంగణంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధికి నిధుల మంజూరు గురించి మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు రాజనర్సింగరావు తెలిపారు.

### బాధ్యతలు స్వీకరణ

పెగడపల్లి: మండల తహసీల్దార్‌గా ఎంఏ ఫారుక్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ కృష్ణచైతన్య ధర్మపురికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో బుగ్గారం తహసీల్దార్‌గా ఉన్న ఎంఏ ఫారుక్‌ను పెగడపల్లి తహసీల్దార్‌గా నియమించారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించగా సిబ్బంది ఆయనను కలిసి పరిచయం చేసుకున్నారు. తహసీల్దార్ ఎంఏ ఫారూక్‌ను నామాపూర్ గ్రామస్తులు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరుణాకర్ రెడ్డి, ఎంపీటీసీ రజిత, నాయకులు పాల్గొన్నారు.

**ఉపాధిహామీ సామాజిక తనిఖీలు**

కథలాపూర్: మేడిపెల్లి మండలంలో గ్రామాల వారీగా అధికారులు ఉపాధిహామీ సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నారు. డిసెంబర్ 2020 నుంచి మార్చి 2023 వరకు సుమారు రూ.18 కోట్ల పనులు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. వీటికి సంబంధించి గ్రామాలవారీగా రిసోర్స్ పర్సన్లతో పనులను తనిఖీ చేయిస్తున్నారు. గ్రామస్తుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు. ఈ నెల 9న ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తామని ఏపీవో నవీన్ తెలిపారు.

**ఇంటింటికీ మొక్కలు పంపిణీ**

ధర్మపురి: హరిత హారంలో భాగంగా శనివారం పట్టణంలోని 5 వార్డులో చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. నాటిన మొక్కలను సంరక్షించాలని కోరారు. వార్డు కౌన్సిలర్ తరాల కార్తిక్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆకుల రాజేశ్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

### 'సుప్రీంకోర్టు తీర్పు బీజేపీకి చెంపపెట్టు'

మెట్‌పల్లి: రాహుల్ గాంధీకి సూరత్ కోర్టు విధించిన జైలు శిక్షపై సుప్రీంకోర్టు స్టే విధించడం బీజేపీకి చెంపపెట్టు లాంటిదని మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి జ్యోతక్క అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వల్ల దేశ ప్రజలకు న్యాయ వ్యవస్థపై నమ్మకాన్ని పెంచిందన్నారు. కోర్టు తీర్పుతో రాహుల్‌గాంధీ ఎంపీ సభ్యత్వ పునరుద్ధరణకు మార్గం సుగమమైందన్నారు. సమావేశంలో నాయకులు ఎర్రోళ్ల హన్మాండ్లు, కంతి హరికుమార్, లక్ష్మయ్య, గణేశ్, నర్సయ్య తదితరులున్నారు.

### తల్లి పాలు పిల్లలకు శ్రేష్ఠం


గర్భిణులకు సీమంతం చేస్తున్న సూపర్‌వైజర్

జగిత్యాల/ జగిత్యాల రూరల్ /రాయికల్/పెగడపల్లి/కోరుట్ల /కోరుట్ల రూరల్/ కోరుట్ల/కోరుట్ల రూరల్/ వెల్గటూర్/మల్యాల /సారంగాపూర్: తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేష్ఠమని, ప్రతి తల్లి పిల్లలకు తాగించడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అన్నారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. తల్లి పాల విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమాల్లో సీడీపీవోలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు పాల్గొన్నారు.

## స్వగ్రామం చేరిన వలసజీవి మృతదేహం


శవపేటిక వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

కథలాపూర్: బీమారం మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పస్తం సాయిలు(34) అనే వ్యక్తి దుబాయి దేశంలో గత నెల 19న ఆత్మహత్య చేసుకోగా.. మృతదేహం శనివారం ఇంటికి చేరింది. బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... సాయిలు స్థానికంగా కూలీ పని చేసుకుని జీవించేవాడు. రూ. 8 లక్షల వరకు అప్పులు ఉండటంతో ఏడాది క్రితం లేబర్ పనిపై దుబాయి వెళ్లారు. అక్కడ కారు వాషింగ్ కంపెనీ వ్యక్తి పని ఇప్పిస్తామని మోసం చేయడంతో చేసిన అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 18 రోజుల తర్వాత మృతదేహం ఇంటికి చేరడంతో కుటుంబసభ్యుల, బంధువుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాదం నెలకొంది. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. సాయిలు శవయాత్రలో గల్ఫ్ జేఏసీ నాయకులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమ నిధి, గల్ఫ్‌లో మృతిచెందితే రూ. 5 లక్షలు పరిహారం ఇస్తామన్న హామీ ఏమైందని ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిల్ల రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**ఆర్థిక సాయం అందజేత**

మల్లాపూర్: మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన బోయపోత చిన్నరాజం శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి గ్రామ పంచాయతీ తరఫున రూ. 10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెల్మల రాజనర్సయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

**ఇంటింటికీ మొక్కలు పంపిణీ**

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్ గ్రామంలో శనివారం సర్పంచ్ వనతడుపుల అంజయ్య ఆధ్వర్యంలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎంపీటీసీ చిట్నేని లత, ఉప సర్పంచ్ సంకె రాకేష్, కార్యదర్శి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

**స్త్రీనిధి సొమ్ము అందజేత**

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామానికి చెందిన ఈశ్వరి అనే మహిళ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందగా ఆమె కుటుంబానికి స్త్రీనిధి సొమ్ము రూ. 43 వేల నగదును శనివారం ఐకేపీ, బ్యాంకు అధికారులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్, ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక పాల్గొన్నారు.

**విద్యార్థి కుటుంబానికి చేయూత**

వెల్గటూర్: తమ వద్ద విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న 10వ తరగతి విద్యార్థి అకాల మరణం చెందడంతో, ఆ విద్యార్థి కుటుంబానికి అండగా నిలబడ్డారు వెల్గటూర్ జెడ్పీ హై స్కూల్ ఉపాధ్యాయులు. లొత్తునూర్ గ్రామానికి చెందిన శాఖపురం నవీన్ వెల్గటూర్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. అయితే ఇటీవల తీవ్ర అనారోగ్యంతో ఈ నెల 2న మృతిచెందాడు. నవీన్‌ది నిరుపేద కుటుంబం కావడంతో ఉపాధ్యాయులు విరాళాలు సేకరించి రూ. 11 వేలు నవీన్ తల్లిదండ్రులు రమ–లచ్చయ్యకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్**

జగిత్యాలరూరల్: రాష్ట్ర శాసనసభ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వగా శనివారం ఉదయం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ మధుతో పాటు, కౌన్సిలర్ నక్క జీవన్, బొల్లి శేఖర్, అనిల్‌తోపాటు, పలువురు యూత్ కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పట్టణ సీఐ నటేశ్ శనివారం ఉదయం ముందస్తుగా అరెస్ట్ చేసి వ్యక్తిగత పూచికత్తుపై వదిలిపెట్టారు.

**గృహలక్ష్మి కి దరఖాస్తు చేసుకోవాలి**

జగిత్యాలరూరల్/మల్యాల/ ధర్మపురి/మెట్‌పల్లి/రాయికల్/ఇబ్రహీంపట్నం:గృహలక్ష్మి పథకంలో భాగంగా సొంత ఇంటి స్థలం ఉన్నవారు గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవోలు తెలిపారు. దరఖాస్తుతో పాటు ఇంటి స్థలానికి సంబంధించిన పత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం, ఆహార భద్రత కార్డు, ఆధార్ కార్డ్ జిరాక్స్‌లతో ఎంపీడీవో కార్యాలయాల్లో సమర్పించాలని పేర్కొన్నారు.

**కొడిమ్యాలలో కేంద్ర బృందం పరిశీలన**

కొండగట్టు: కొడిమ్యాల మండల కేంద్రంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా శనివారం కేంద్ర బృందం పర్యటించింది. గ్రామంలోని ఇంకుడు గుంతలు సానిటేషన్ పారిశుధ్యం, చెత్త కుండీలు పాఠశాలల్లోని మరుగుదొడ్లపై పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏలేటి మమత, టీం కో ఆర్డినేటర్ సాయి కుమార్, డీఎల్‌పీవో కనకదుర్గ, ఎంపీడీవో పద్మజ, ఎంపీవో ప్రవీణ్, కార్యదర్శి మహేశ్ పాల్గొన్నారు.

**విద్యుత్‌సరఫరా నిలిపివేత**

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు, శ్రీనగర్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఏఈ రహీం తెలిపారు.